క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జాయింట్ సెక్రటరీగా వేమా


వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా వేమా శ్రీనివాసరావు నియమితులయ్యారు. శనివారం వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మండల జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావును నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బంధువులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. సాక్షితో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఈ పదవి రావడంలో సహకారం అందించిన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు.

దేవరపాలెంలో రీ సర్వే గ్రామసభ


రీ సర్వే గ్రామసభలో పాల్గొన్న అధికారులు

చీమకుర్తి రూరల్: మండలంలోని దేవరపాలెం గ్రామంలో రీ సర్వేకు సంబంధించిన గ్రామసభను మండల రెవెన్యూ అధికారి ఆర్ బ్రహ్మయ్య నిర్వహించారు. శనివారం దేవరపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో వారు మాట్లాడుతూ భూముల రీసర్వే ప్రాజెక్టులో భాగంగా దేవరపాలెంను పైలట్ గ్రామంగా ఎంపిక కాగా, రీసర్వే ద్వారా భూముల కొలతలు వేశామన్నారు. డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్‌లో ఉన్న రైతుల భూమి కొలతలు, ఎల్పీఎం నంబరు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ప్రసిడెంట్ చిన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్వే ఉప తహసీల్దారు పి అరుణ, మండల సర్వేయర్ మోజెష్, ఆర్ఐ ఎం మౌనిక శ్రీలక్ష్మి, వీఆర్వో చంద్ర, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుతో విద్యారంగం గందరగోళం



ఒంగోలు టౌన్: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గందరగోళంలోకి నెట్టిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ విమర్శించారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 10న చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను శనివారం స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నం.77ను రద్దు చేసి అర్హులందరికీ స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్న కూటమి పాలకులు ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉంటే వాటిని విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక గుర్తింపు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా చర్యలు తీసుకోకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణాలకు ఒక్క రూపాయి కూడా నిధులను విడుదల చేయడం లేదని మండిపడ్డారు. సమస్యల పరిష్కారంకోసం విజయవాడలో ఈ నెల 10న చేపట్టే ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఎం.సునీల్‌కుమార్, నగర నాయకులు సతీష్‌కుమార్ నాయక్, లక్ష్మణ్ నాయక్, హనుమంతరావు, యూనివర్సిటీ విద్యార్థులు వెంకటేష్, సంపత్‌కుమార్, వసంత్, మదన్, గణేష్ పాల్గొన్నారు.

అన్ని గ్రేడ్‌లు కొనుగోలు చేయాలి

కొండపి: పొగాకు కంపెనీ ప్రతినిధులు వేలం కేంద్రానికి వచ్చిన అన్ని పొగాకు గ్రేడులను కొనుగోలు చేయాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ శీలం రామారావు అన్నారు. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలు తెలుసుకుని వ్యాపారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ రామారావు రైతులతో మాట్లాడుతూ రైతులంతా మండెల్లో మగ్గిన పొగాకును బేళ్లు కట్టుకొని అమ్మకానికి తీసుకు రావాలని తెలిపారు. మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకొని రావాలని సూచించారు. బేళ్లు అమ్మకానికి తెచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ దృష్ట్యా తెలపరి పొగాకు, నీళ్లు కట్టిన పొగాకును తీసుకురావద్దని స్పష్టం చేశారు. కొన్ని కంపెనీ వాళ్లు కొనుగోలు చేసిన బేళ్లలో అన్య పదార్థాలు ఉన్నందున కస్టమర్స్ వాటిని తిరస్కరించారని తెలిపారు.

మురుగు కదలదు.. అధికారులు పనిచేయరు !


కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ పరిధిలో నీరు నిల్వ ఉన్న మురుగు


బీచ్ రోడ్డు ఎస్సీ కాలనీ ఎదురుగా మురికి నీరుతో ఉన్న దృశ్యం

- కొత్తపట్నంలో కంపుకొడుతున్న వీధులు
- రోడ్ల మధ్య గుంతలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

కొత్తపట్నం:

మండల కేంద్రం కొత్తపట్నంలో కంపుకొడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపట్నం హైస్కూల్ వద్ద ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీ వరకు సిమెంట్ రోడ్డు వేశారు. నిధులు సరిపోకపోవడంతో మధ్యలో 12 అడుగుల ఖాళీ వదిలి పెట్టారు. వర్షం వచ్చినప్పుడు ఈ ఖాళీ స్థలంలో నీరు చేరి నిల్వ ఉంటోంది. దీంతో పంచాయతీ సిబ్బంది తొలగించకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారింది. అటువైపు వెళ్లాలంటే ముక్కుమూసుకునే వెళ్లే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు బస్టాండ్ సెంటర్‌లో చేపలు, రొయ్యలు, మాంసం విక్రయాలు రోడ్డు మీదనే జరుగుతున్నాయి. ఆ ప్రాంతమంతా ఈగలు, దోమలు చేరి రోడ్డంతా కంపు కొడుతోంది. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్, సున్నం కూడా చల్లిన పాపాన పోలేదు. ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసికెళ్లినా అక్కడ విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌లో ఎప్పుడూ చూసినా దుమ్ము, ధూళిచేరుతోంది. దీంతో ప్రయాణికులు, పర్యాటకుల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అలాగే శివాలయం వీధిలో చెత్త మొత్తాన్ని డంప్ చేయడంతో దుర్వాసన వస్తోందని భక్తులు చెప్తున్నారు. రాజుగోపాలస్వామి గుడి ఎదురుగా ఎప్పుడు చూసినా మురుగు నిల్వ ఉంటోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుకుంటున్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి


మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు


సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు సిటీ: పదవులు దక్కినవారు వైఎస్సార్ సీపీకి వన్నె తీసుకురావాలని ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు. శనివారం ఒంగోలు పట్టణంలోని 23వ డివిజన్‌లోని గానుగపాలెంలోని రామమందిరం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. చంద్రబాబు 'షూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. కూటమి ఏడాది పాలనపై అన్ని వర్గాల్లో అసంతృప్తి నెలకొందన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే మిన్నగా పథకాలను ఇస్తామని చెప్పి సీఎం చంద్రబాబు ప్రజలందరినీ మోసం చేశారన్నారు. కూటమి ఏడాది పాలనలో ప్రతి ఇంటికీ జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు మరింత పట్టుదలతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, డివిజన్ అధ్యక్షుడు జి.ఎస్.కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలడుగు రాజీవ్, క్రాంతికుమార్, వెన్నుపూస వెంకటేశ్వరరెడ్డి, ప్రవీణ్‌కుమార్, బుజ్జి, సాగర్, భూమిరెడ్డి రమణమ్మ, వాణి, అప్సరబేగం, ప్రసన్న, మేరీ, చిన్నా, షేక్ మున్వర్, షేక్ అరీఫ్, శ్రీనివాస్, ఫణేంద్రబాబు, ఆషిఫ్, ప్రసాద్‌రావు, వలి, సురేష్, ముజీబ్, జియా, షరీఫ్, మున్వర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీగిరిలో ముగిసిన ఆరాధనోత్సవాలు

ఒంగోలు మెట్రో: అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఒంగోలు కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన ప్రారంభమైన అభయాంజనేయ స్వామి వారి ఆగమన ఆరాధనోత్సవాలు వైభవంగా ముగిశాయి. ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ములుకుట్ల సుబ్రహ్మణ్య శర్మ రామాయణంలోని సుందర కాండ విశిష్టతను గురించి చక్కగా వివరించారు. సుందరకాండ పఠన శ్రవణ పారాయణం సీతారాముల అనుగ్రహంతోపాటు ఆంజనేయస్వామి వారి అనుగ్రహం కూడా భక్తులకు కలుగుతుందని వివరించారు. శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారిలతో పాటు ఆలూరు జై శంకర్ తదితరులు ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ములుకుట్ల సుబ్రహ్మణ్య శర్మను ఘనంగా సత్కరించారు. పేర్నమిట్ట వెంకట సాయి సుస్మిత్ వెంకటేశ్వర స్వామికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు.

రేపు మాదిగ మహా మేళా


చీమకుర్తిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

ఒంగోలు వన్‌టౌన్: మాదిగ మహా మేళాను ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల మాదిగల సుదీర్ఘ పోరాటం ద్వారా లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేసిన ప్రతి మాదిగకు ఉద్యమాభినందనలు అని తెలిపారు. సోమవారం నిర్వహించే ర్యాలీ మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీఎం కళాశాల వద్ద నుంచి ప్రారంభమవుతుందని, ర్యాలీ అనంతరం నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న మున్సిపల్ ఆడిటోరియంలో సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ, దళిత హక్కుల సాధన సమితి ముప్పవరపు గోపి, రేణమాల మాదవ మాదిగ, జంగ్రాజుపల్లి బాలరాజు మాదిగ, ఎండ్లూరి రవి, బైదుపోగు సుధాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

7న ఈదుమూడిలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ..

ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను ఈనెల 7వ తేదిన నాగులుప్పలపాడు మండలం ఈదుమూడిలో నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక కార్యదర్శి పి కృపాకర్ మాదిగ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చీమకుర్తి: మాదిగ మహామేళాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య పిలుపు మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమానికి చీమకుర్తి మండలం నుంచి ఎక్కువ సంఖ్యలో ఒంగోలు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బక్కా రాజు, చిన్నా, నతానియేల్, మరియదాస్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఒంగోలు సబర్బన్: మహిళలు అన్ని రంగాల్లోనూ ముందడుగు వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) లోని రిసోర్స్ పర్సన్‌లకు 164 ట్యాబులు, డిజీ లక్ష్మిలకు 100 బయోమెట్రిక్ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రిసోర్స్ పర్సన్లు తమ గ్రూపులకు సంబంధించిన వివరాలు, లావాదేవీలను పుస్తకాలలో కాకుండా నేరుగా ఈ ట్యాబ్‌లలో నమోదు చేయాలన్నారు. తద్వారా ఆ వివరాలు సీఎం డాష్ బోర్డుకు అనుసంధానం అవుతాయన్నారు. మెప్మా పీడీ శ్రీహరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, డాక్టర్ అల్లూరి నితిన్, డాక్టర్ ప్రతిమ పాల్గొన్నారు.

పొగాకును అక్రమంగా కొనుగోళ్లు చేయవద్దు


వేలం నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

టంగుటూరు: పొగాకును అక్రమ కొనుగోళ్లు, అమ్మకాలు చేయవద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా అక్రమంగా పొగాకు బేళ్లు తరలిస్తుంటే బోర్డు వారికి సమాచారం ఇవ్వాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాధువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 952 బేళ్లను తీసుకొచ్చారు. వాటిలో 798 కొనుగోలు చేయగా 154 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280 కాగా, కనిష్ట ధర రూ.160 పలికింది. సరాసరి రూ.215.43 ధర పలికింది. వేలంలో మొత్తం 25 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 237 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని కట్టవారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 872 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 635 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 237 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.160, సరాసరి ధర కేజీ రూ.228.45 గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో గోత్రరాత్ర హోమాలు


సుందర కాండ పారాయణం చేస్తున్న సుబ్రహ్మణ్య శర్మ

ఒంగోలు మెట్రో: వారాహి నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో గోత్రరాత్ర హోమాలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని బాపూజీ గో సంరక్షణ సంఘం ఆధ్వర్యంలో గోత్రిరాత్ర హోమాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. గో సంఘం, శ్రీగిరి గిరి ప్రదక్షిణ కమిటీ, వీహెచ్పీ, స్కందగిరి గిరి ప్రదక్షిణ సేవ కమిటీ నిర్వహణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు హోమం భక్తి రసభరితంగా సాగింది. గో ఉపాసకుడు బ్రహ్మశ్రీ కుందుర్తి మహీకిరణ్ శర్మ వారి పర్యవేక్షణలో వారాహి కవచ మంత్ర సహితంగా అమ్మవారిని ఆవాహన చేస్తూ హోమం చేశారు.

మూడు రోజుల పాటు విద్యుత్ నిలిపివేత

ఒంగోలు సబర్బన్: శ్రీగిరి కొండ మీద ఉన్న నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు నూతన విద్యుత్ లైను ఏర్పాటు చేస్తున్న సందర్భంగా వరుసగా మూడు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఒంగోలు నగర విద్యుత్ శాఖ డీఈఈ కేవీ పాండు రంగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు కొన్ని సమయాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తామన్నారు. శ్రీగిరి సబ్ స్టేషన్ కొండమీద నుంచి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడం కోసం 33 కేవీ హాస్పిటల్ ఫీడర్ మీద సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. 11 కేవీ మున్సిపల్ ఫీడర్, 11 కేవీ ఆర్పీ రోడ్డు ఫీడర్, 11 కేవీ గొడుగుపాలెం ఫీడర్‌లలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ ఆఫీస్, శివాలయం, సీవీఎస్ రీడింగ్ రూమ్, గాంధీ రోడ్, ఏనుగు చెట్టు, మాతా శిశు వైద్య శాల, కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్, శ్రీగిరి కొండమీద, రాజా పాలకాల రోడ్డు, జమ్మి చెట్టు బజారు, సాయిబాబా టెంపుల్ ఎదురు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, గద్దలగుంట, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

మద్దిపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ప్రతి రోజు సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి పేర్కొన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం మద్దిపాడులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఇటీవల స్టేట్ బ్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి వద్ద నిర్మించిన కాలువను పరిశీలించారు. నీరు సక్రమంగా బయటకు పంపడానికి వీలుగా కట్టారా లేదా అంటూ ఇన్‌చార్జి కార్యదర్శిని ప్రశ్నించారు. అనంతరం ఆయన తడి చెత్త, పొడి చెత్తలను వేరుగా సేకరిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ఎస్‌డబ్ల్యూ పీసీ వద్దకు చేరుకుని అక్కడ నిర్వహణ లేకపోవడం గమనించారు. చెత్తను ఎక్కడ పోస్తున్నారు. పొడి చెత్తను రీసైకిలింగ్ చేయడానికి గల అవకాశాలను ఆయన పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూ పీసీ వద్ద షెడ్ పూర్తిగా పాడయిపోవడం ఆయన గమనించారు. తక్షణమే బాగు చేయించి మళ్లీ పూర్వ స్థితికి వచ్చేలా చేయాలని ఆయన కార్యదర్శికి తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఇన్‌చార్జి కార్యదర్శి ఆశాలత, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీని కలిసిన సంజయ్‌కుమార్


సంజయ్ కుమార్‌ను సత్కరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు సిటీ: నూతనంగా ఏర్పడిన ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం)యూనిట్ల పనితీరును ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ప్రతినిధి ఎస్.సంజయ్ కుమార్ శనివారం ఏకేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్. మూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల పనితీరు, నిధుల కేటాయింపు, దత్తత తీసుకున్న గ్రామాలలో విద్యార్థులు, వలంటీర్లు చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయన్నారు. నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీ అయినప్పటికి ఎన్ఎస్ఎస్ యూనిట్ల పనితీరు ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న యూనిట్లకు అదనంగా మరో 75 యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు ఆయన వీసీ ప్రొఫెసర్ మూర్తికి తెలిపారు. అనంతరం సంజయ్ కుమార్‌ను వీసీ ప్రొఫెసర్ మూర్తి శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సంజయ్ కుమార్ యూనివర్సిటీలో ఉన్న స్థానిక ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక కో ఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్‌తో మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం


మస్టర్ పాయింట్ వద్ద ప్రదర్శన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఒంగోలు టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే మరో ఉద్యమానికి సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక అద్దంకి బస్టాండు సెంటర్లోని మస్టర్ పాయింట్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శనివారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఇదే ధోరణి కొనసాగిస్తే సహించేది లేదని, సార్వత్రిక సమ్మె తరువాత కార్మికుల సమస్యలపై మరో సమ్మె పోరాటానికి సిద్ధమవుతామన్నారు. మున్సిపల్ కార్మికులకు గత సంవత్సర కాలంలో సమ్మె కాల ఒప్పందాలను అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లో తీసుకోకుండా మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. చనిపోయిన, ఆరోగ్యం బాగాలేని కార్మికుల సంతానానికి ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, నాయకులు సీహెచ్ అక్కేశ్వరరావు, బి.అరుణ, శ్రీదేవి, చిన్నబ్బాయి శ్రీను, కే.పద్మ తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా రుక్మిణి కల్యాణం


రుక్మిణి కల్యాణంలో పాల్గొన్న త్రిదండి అహోబల జీయర్‌స్వామి

ఒంగోలు మెట్రో: వికాస తరంగిణి ఆధ్వర్యంలో రుక్మిణి కల్యాణాన్ని నయన మనోహరంగా నిర్వహించారు. శనివారం ఒంగోలు గాంధీ రోడ్డు దక్షిణం బజార్‌లో పెద్ద రామానుజ కూటమిలో మద్భాగవత సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి రుక్మిణి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. త్రిదండి అహోబిల శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామివారి మంగళ శాసనాలతో ప్రత్యక్ష పర్యవేక్షణ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.